**DUKES FACTORY**

కష్టాలు మనిషిని కుంగదీస్తాయని చాలా మంది బాధపడతారు కానీ,
కష్టాలను ధైర్యంగా ఎదిరిస్తే.. అవి విజయసోపానాలవుతాయని నిరూపించారు రవీందర్ కుమార్ అగర్వాల్.
జీవిత ఆరంభంలో నాన్నను కోల్పోవడం రవీందర్ జీవితంలో పెద్ద దెబ్బ.
అమ్మ కమలాబాయి ఇంటికి పెద్ద దిక్కయి, ఓ చిన్న రేషన్ షాప్ ఆధారంగా ఏడుగురు పిల్లలను సాకుతుండడం రవీందర్‌కు ఎవరు నేర్పకుండానే తెలిసొచ్చిన ఆర్థిక పాఠం. ఉదయం 4గంటలకు రేషన్ షాప్‌కు వెళ్లిన అమ్మ రాత్రి 10గంటల వరకు కష్టపడుతుంటే.. రవీందర్ కుమార్‌కు తన లక్ష్యమేంటో స్పష్టంగా తెలిసొచ్చింది.

నమ్మిన వ్యాపార సూత్రాన్ని నిజాయతీగా అమలు చేస్తే.. ఎంతటి విజయాన్నైనా అందుకోవచ్చని అమ్మ నేర్పిన పాఠంతో ఫుడ్ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టారు. ఛాయ్ బిస్కట్ అనేది ప్రతి సామాన్యుడికి నచ్చే కాంబినేషన్ కావడంతో బిస్కట్ తయారీని ఎంచుకున్నారు. రుచి, నాణ్యత, తక్కువ ధర అనే మూడు ముఖ్యమైన అంశాలను ప్రామాణికంగా పెట్టుకున్నారు. 1995లో కాటేదాన్‌లో బిస్కెట్స్ ఫ్యాక్టరీ ప్రారంభించారు రవి.

మార్కెటింగ్ కోసం బడా కంపెనీలను సంప్రదిస్తే... ప్రోత్సాహం రాలేదు సరికదా సర్టిఫికెట్ కూడా రద్దవడంతో రవీందర్ కుమార్‌లో కసితో పాటు పట్టుదల పెరిగింది. అక్కడే డ్యూక్ బ్రాండ్ పుట్టింది. ఒకప్పుడు బిస్కట్లను అమ్మడానికి కష్టపడ్డ రవీందర్ డ్యూక్ బ్రాండ్‌తో పెద్దపెద్ద కంపెనీలనే తన వెంటపడేలా చేశారు. 5 కోట్ల పెట్టుబడితో ప్రారంభించిన డ్యూక్ బ్రాండ్ నేడు వెయ్యి కోట్ల టర్నోవర్‌కు చేరింది.

రవీందర్ కంపెనీ ఉద్యోగుల్లో సగానికి పైగా మహిళలే. అమ్మ, అమ్మమ్మల నుంచి పొందిన స్ఫూర్తితో ఎక్కువ మంది మహిళలను ఉద్యోగులుగా ఎంచుకున్నామని చెబుతారు. వంట, భోజనం వీటితో మహిళలకు అవినాభావ సంబంధం ఉంటుందని, అందుకే ఫ్యాక్టరీలో స్త్రీలు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. డ్యూక్ బ్రాండ్ నుంచి చిన్నా పెద్దా అందరూ ఇష్టపడేలా బిస్కట్లు, చాక్లెట్లు, వేపర్లు, కాన్ ఫెక్షనరీస్.. ఇలా 150 రకాల ఉత్పత్తులు తయారవుతున్నాయి. దేశీయంగా ఏటా 700 కోట్ల ఆదాయం అందిస్తున్న ఈ కంపెనీ... అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్, బ్రిటన్, ఆఫ్రికాతో పాటు ఎన్నో దేశాలకు ఎగుమతులు చేస్తోంది. అనుకున్న లక్ష్యం సాధించాలనే కసి గుండెనిండా ఉంటే చాలు... బిజినెస్ బిందాస్ అవుతుందంటున్న రవిందర్ కుమార్ ఈ ఏడాది సాక్షి ఎక్సలెన్స్ బిజినెస్ పర్సన్ ఆఫ్ ది ఇయర్‌గా అవార్డు అందుకుంటున్నారు.